## వేములవాడలో పోటెత్తిన భక్తులు

# శ్రావణ చివరి సోమవారం సందడి

ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రచార రథంలో ఉత్సవ మూర్తుల దర్శనం



**వేములవాడ, సెప్టెంబర్ 7, తెలంగాణ అడ్డా ప్రతినిధి:** రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో శ్రావణ మాసం చివరి సోమవారం సందర్భంగా భక్తుల రద్దీ భారీగా పెరిగింది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి రాజన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని రావి చెట్టు కింద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రచార రథంలో స్వామివారి ఉత్సవ మూర్తులను భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. అనంతరం తమ మొక్కులు చెల్లించుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు. శ్రావణ మాసం చివరి సోమవారం కావడంతో తెల్లవారుజాము నుంచే భక్తుల రాక ప్రారంభమైంది. ఆలయ పరిసరాలు భక్తుల సందడితో కిటకిటలాడాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి, దర్శన ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు చేపట్టారు. క్యూలైన్లలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు పర్యవేక్షించారు. శ్రావణ మాసం చివరి సోమవారం సందర్భంగా వేములవాడ రాజన్న క్షేత్రం భక్తజన సందోహంతో కళకళలాడింది.

## గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ భారీ నిరసన.. అసెంబ్లీలో టీషర్ట వివాదంపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం




**హైదరాబాద్ బ్యూరో / తెలంగాణ అడ్డా:** వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్ పార్క్‌లోని అమరవీరుల స్థూపానికి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ నల్ల టీషర్టు ధరించి భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆరు గ్యారంటీలు, 420 హామీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, 1000 రోజులు గడిచినా ఆ హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని కేటీఆర్ మండిపడ్డారు. ఈ నిరసనలో భాగంగా అసెంబ్లీలోకి వెళ్తున్న బీఆర్ఎస్ సభ్యులను స్పీకర్ అనుమతించకపోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. సభ్యులు ధరించిన టీషర్టుపై ఉన్న రాతలు బాగోలేవని, బట్టలు మార్చుకొని రావాలని చెప్పి లోనికి రానివ్వకపోవడాన్ని కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. ఈ సందర్భంగా పార్లమెంటులో రాహుల్ గాంధీ అదానీ, అంబానీ అంటూ పేర్లు రాసుకున్న టీషర్టు వేసుకొని వెళ్లొచ్చని, కానీ తాము ప్రజా సమస్యలపై నినాదాలు రాసుకొని వెళ్తే అభ్యంతరం చెప్పడం ఏంటని ఆయన ప్రశ్నించారు. రాహుల్ గాంధీకి ఒక న్యాయం, మాకు ఒక న్యాయమా? పార్లమెంటులో ఒక పద్ధతి, అసెంబ్లీలో మరో పద్ధతియా? అని కేటీఆర్ నిలదీశారు. ప్రభుత్వం తమ గొంతు నొక్కాలని చూస్తోందని, సమస్యలపై మాట్లాడకుండా అడ్డుకోవడం అప్రజాస్వామ్యమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## జగిత్యాలలో ఘనంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించిన అబ్దుల్ జమీల్



**జగిత్యాల బ్యూరో / తెలంగాణ అడ్డా:** జగిత్యాల జిల్లా కేంద్రంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యా రంగంలో విశేష సేవలందించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పీఆర్ ఉపాధ్యాయ మాసపత్రిక సంపాదకవర్గ సభ్యులు, జెడ్పీహెచ్ఎస్ నూకపల్లి స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్) అబ్దుల్ జమీల్.. జగిత్యాల శాసనసభ్యులు (ఎమ్మెల్యే) శ్రీ డాక్టర్ సంజయ్ కుమార్ గారి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు మరియు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. విద్యాబోధనలో ఆయన ప్రతిభను, విద్యార్థుల భవిష్యత్తు కోసం చేస్తున్న కృషిని గుర్తించి ఈ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత అబ్దుల్ జమీల్‌కు తోటి ఉపాధ్యాయులు, పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

## వీర్నపల్లిలో ప్రజావాణి.. 9 అర్జీల స్వీకరణ




**తెలంగాణ అడ్డా -- వీర్నపల్లి ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల స్థాయిలో వికేంద్రీకరించడంలో భాగంగా వీర్నపల్లి మండల ప్రజాపరిషత్ (ఫ్రీా) కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా 11 మంది అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు, అర్జీలను స్వీకరించారు. మొత్తం 9 అర్జీలు అందగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

**గ్రామీణ సమస్యల పరిష్కారానికి వేదిక**

ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజావాణి కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా మారిందని అధికారులు పేర్కొన్నారు.

**9 అర్జీల స్వీకరణ**

ప్రజల నుంచి మొత్తం 9 ఫిర్యాదులు, అర్జీలు అందాయని అధికారులు తెలిపారు.

11 మంది అధికారులు హాజరు

వివిధ శాఖలకు చెందిన 11 మంది అధికారులు కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.

**త్వరిత పరిష్కారానికి చర్యలు**

వీర్నపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఫీుణా) శ్రీమతి బాజోజి శ్రీలేఖ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉన్న సమస్యలపై సత్వర పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రజావాణిలో అందిన 9 అర్జీలను వెంటనే సంబంధిత అధికారులకు పంపించి, వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# మాధవాని కుంటను కాపాడాలి: జీహెచ్ఎంసీ డీసీకి బీజేపీ నేత వినతి



**బొల్లారం, తెలంగాణ అడ్డా:** బొల్లారం జీహెచ్ఎంసీ 272వ డివిజన్ పరిధిలోని మాధవాని కుంటలోకి డ్రైనేజీ, మురుగు నీరు చేరకుండా తక్షణ చర్యలు చేపట్టాలని బీజేపీ బొల్లారం పట్టణ అధ్యక్షుడు కెజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ ప్రవీణ్ కుమార్‌ను కోరారు. ఈ మేరకు ఆయన డీసీని కలిసి వినతిపత్రం అందజేసి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గతంలో బొల్లారం ప్రజలకు తాగునీటి వనరుగా ఉపయోగపడిన మాధవాని కుంట ప్రస్తుతం మురుగు నీరు కలవడంతో తీవ్రంగా కలుషితమవుతోందని ఆనంద్ కృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కుంటకు ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. బొల్లారం ప్రజలు భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జన కార్యక్రమాలను ఈ కుంటలో నిర్వహిస్తారని, అలాగే మహిళలు ఎంతో ఉత్సాహంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించి బతుకమ్మలను కుంటలో సమర్పిస్తారని ఆయన గుర్తుచేశారు. అలాంటి ప్రాధాన్యత కలిగిన కుంటను మురుగు నీటి నుంచి రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. కుంటలోకి వస్తున్న డ్రైనేజీ లైన్‌ను తక్షణమే వేరుచేసి, ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా మురుగు నీటిని బయటకు మళ్లించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే కుంట చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, పరిసరాలను పూర్తిస్థాయిలో శుభ్రపరచి, కుంటను పరిరక్షించాలని కోరారు.

మాధవాని కుంటలోకి ఇకపై ఎలాంటి మురుగు నీరు చేరకుండా శాశ్వత పరిష్కారం చూపించి బొల్లారం ప్రజలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమస్యపై జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు కెజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి తెలిపారు.

## 420 హామీలపై జిన్నారం MRO, కమిషనర్‌కు బీఆర్ఎస్ వినతిపత్రం

అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టును నిరసిస్తూ అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా



**జిన్నారం, తెలంగాణ అడ్డా:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీల అమలుపై జిన్నారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జిన్నారం మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రస్తావిస్తూ జిన్నారం వీ=ూ, మున్సిపల్ కమిషనర్‌కు బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా అసెంబ్లీ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ పార్టీ శాసనసభ్యులను అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ జిన్నారం అంబేద్కర్ చౌరస్తాలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేయడం, వాటి అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్షాల బాధ్యత అని పేర్కొన్నారు. అసెంబ్లీ వద్ద శాంతియుతంగా నిరసన తెలిపిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనని వారు విమర్శించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలు తెలిపే హక్కును ప్రభుత్వం గౌరవించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జనార్దన్, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జిన్నారంలో కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ

6 గ్యారంటీలు.. 420 హామీలు.. అమలులో కాంగ్రెస్ విఫలమైందని బీఆర్ఎస్ ఆరోపణ



**జిన్నారం, తెలంగాణ అడ్డా:** తెలంగాణ ప్రజలకు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ జిన్నారం మున్సిపల్ కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'కాంగ్రెస్ బాకీ కార్డుల'ను గడపగడపకు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ జిన్నారం టౌన్ ప్రెసిడెంట్ గోపగో శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఆరు గ్యారంటీలు, 420 హామీల పేరుతో ప్రజలను ఆకర్షించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, కేసీఆర్ కిట్, రైతు భరోసా, రైతు రుణమాఫీ, నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, కల్యాణ లక్ష్మి పథకంలో తులం బంగారం, మహిళలకు స్కూటీలు తదితర హామీలను కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందని, వాటిలో అనేక హామీలు ఇంకా పూర్తిస్థాయిలో అమలు కాలేదని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ హామీలను ప్రజలకు మరోసారి గుర్తు చేస్తూ 'కాంగ్రెస్ బాకీ కార్డులు' పంపిణీ చేస్తున్నామని తెలిపారు. హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ప్రశ్నించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, పార్టీ నాయకులు మంద రమేష్, శ్రీధర్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, తోట నర్సింగరావు, నీలం మోహన్, బ్రహ్మేందర్ గౌడ్, బిక్షపతి గౌడ్, గోపి గౌడ్, నిఖిల్, నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అమలు చేసింది గోరంత... బాకీ పడింది కొండంత

కాంగ్రెస్ ప్రభుత్వంపై BRS వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు ధ్వజం

**తెలంగాణ అడ్డా కొనరావుపేట ప్రతినిధి:** కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల్లో అమలు చేసింది గోరంత... చేయాల్సింది కొండంత... ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా సబ్బండ వర్గాలను మోసం చేసింది" అని దీ=ూ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంత్రి పదవి కోసం ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తన స్థాయిని మరచి విమర్శలు చేస్తున్నారని, చోటే మోటే నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలని చల్మెడ హితవు పలికారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ విఫల పాలనపై, నెరవేర్చని హామీలపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. "వద్దురా నాయన కాంగ్రెస్ పాలన" అంటూ నాయకులు, కార్యకర్తలు నినాదాలతో హోరెత్తించారు. అనంతరం మండల నాయకులతో కలిసి స్థానిక ఎంపీడీవో, తహసీల్దార్లకు వినతిపత్రం అందజేశారు.

**ఈ సందర్భంగా చల్మెడ లక్ష్మీనరసింహారావు**




**మాట్లాడుతూ**

నిరంకుశ పాలన కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో రేవంత్ రెడ్డి సర్కార్ అభివృద్ధిని విస్మరించి నిరంకుశ, నియంత పాలన సాగిస్తోందని మండిపడ్డారు. రైతు భరోసా బాకీలు రైతు భరోసా కింద ఏడాదికి రూ.15,000 ఇస్తామని చెప్పి ఇప్పుడు రూ.12,000 మాత్రమే ఇస్తున్నారని, ఇప్పటికే మూడు పంటల కాలాలకు సంబంధించిన నిధులను ఎగ్గొట్టారని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 1,30,954 మంది రైతులకు ప్రతి పంటకు రూ.131.04 కోట్లు అందించామని, కాంగ్రెస్ ప్రభుత్వం మూడు సార్లు ఎగ్గొట్టిన బకాయిలే దాదాపు రూ.400 కోట్లు ఉన్నాయని లెక్కలతో వివరించారు. ఆది శ్రీనివాస్‌కు రైతులపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే, ముందుగా ఎగ్గొట్టిన ఆ రూ.400 కోట్ల రైతు బంధు నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయించాలని, లేదంటే రైతులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుల గురించి మాట్లాడే ముందు ఆది శ్రీనివాస్ తన స్థాయి ఏంటో తెలుసుకోవాలని హెచ్చరించారు. రైతులు, మహిళలు, యువత, వెనుకబడిన వర్గాలను మోసం చేసిన ఈ ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి 6 గ్యారెంటీలతో పాటు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని, లేనిపక్షంలో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలను సమీకరించి పోరాటాలను మరింత తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు.



## నల్ల దుస్తులతో అసెంబ్లీకి రావడం నేరమా?

మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల తీరు సిగ్గుచేటు: బీఆర్ఎస్ నాయకుడు మాద్రి పృథ్వీరాజ్

పటాన్‌చెరులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన ధర్నా

**పటాన్‌చెరు, తెలంగాణ అడ్డా:** అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పటాన్‌చెరు పట్టణంలోని జాతీయ రహదారిపై నిరసన ధర్నా నిర్వహించారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గూడెం మధుతో కలిసి బీఆర్ఎస్ నాయకుడు మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత సిగ్గుచేటని విమర్శించారు. ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగబద్ధంగా నల్ల దుస్తులు ధరించి అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడం నేరమా? అని ప్రశ్నించారు. ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల హక్కులను అడ్డుకునే విధంగా ప్రభుత్వం, పోలీసులు వ్యవహరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, ఆ హక్కును కాలరాసే ప్రయత్నాలను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని పృథ్వీరాజ్ అన్నారు. ప్రజల హక్కులు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన సమాధానం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పార్టీ శ్రేణులు, అభిమానులు, ఎంఫీఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

